క్లుప్తంగా

ఆర్‌ఓ ప్లాంట్ వితరణ



నీలానగరం హైస్కూల్‌లో అమర్చిన ఆర్‌ఓ ప్లాంట్

వీరఘట్టం: మండలంలోని నీలానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సుడా చైర్మన్ కోరికాన రవికుమార్ శుక్రవారం రూ.5 లక్షల విలువ గల మంచినీటి ఆర్‌ఓ ప్లాంట్‌ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం గుంట్రెడ్డి రవిప్రసాద్ మాట్లాడుతూ.. పనస నందివాడకు చెందిన రవికుమార్ పాఠశాల పూర్వ విద్యార్థని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయమన్నారు.

మిల్లర్ల పాత్ర తగ్గించాలి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘ నాయకులు

పాలకొండ : ధాన్యం కొనుగోలులో మిల్లర్ల పాత్ర లేకుండా చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘ నాయకుడు బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ.. మిల్లర్లు రైతుల నుంచి క్వింటాకు ఐదు కిలోలు అదనంగా తీసుకుంటున్నారని ఆరోపించారు. దీనికి సబ్‌కలెక్టర్ స్పందిస్తూ విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

ఎల్విన్‌పేటలో సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవ సోదరులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట గ్రామంలో సెమీ క్రిస్మస్ వేడుకలను పాస్టర్లు ఎం.శోభన్‌బాబు, డేవిడ్ కడియాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఒడిశా రాష్ట్రంలోని బొలంగిరికి చెందిన ఫెయిత్ మినిస్ట్రీస్ నిర్వాహకులు ప్రేమ్ రవోలో ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఫెయిత్ మినిస్ట్రీస్ ద్వారా సమకూర్చిన స్వెటర్లను 30 మంది పేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాఫా ఫౌండేషన్ ప్రతినిధి జి.పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు



వినోద్, హౌసింగ్ ఏఈ

వీరఘట్టం: పీఎంఏవై గ్రామీణ, అర్బన్ పథకాలలో భాగంగా మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ వినోద్ కోరారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఐదేళ్లుగా ఈ పథకాల ద్వారా మండలంలో 1210 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. వీటిలో ఇంతవరకు 273 ఇళ్ల నిర్మాణాలు పూర్తవ్వగా.. 350 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మరో 587 ఇళ్ల పనులు ఇంకా ప్రారంభం కాలేదని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోపు ఈ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఎన్నికల సందడి



ఎన్నికల సామగ్రి అందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పాలకొండ : మండలంలో నీటి సంఘాల ఎన్నికల సందడి నెలకొంది. కూటమి ప్రభుత్వం నీటి సంఘాల ఎన్నిలను హడావిడిగా చేపట్టడంతో అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేపట్టారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించిన మెటీయల్‌ను సిబ్బందికి అందించారు. పాలకొండ మండలానికి సంబంధించి 8 మేజర్, 3 మైనర్ సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి.

గిరిజన గురువులకు ఝలక్..



- సీతంపేట ఉపాధ్యాయులకు పాడేరు డిప్యుటేషన్
- 32 మందికి ఉన్నట్టుండి పంపేసిన వైనం
- ప్రభుత్వ తీరుతో ఆందోళనలో ఉపాధ్యాయులు

సీతంపేట: కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్టు ఉంది సర్కారు తీరు. ఒకరి సమస్యను తీర్చకుండా.. మరొకరితో సమస్య తెచ్చుకున్నట్టుంది సర్కారు పరిస్థితి. గురుకులాల్లో అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు తమ సమస్యలు పరిష్కరించండంటూ సమ్మెబాట పడితే వారి స్థానంలో ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులను వేరే జిల్లాలకు డిప్యుటేషన్‌పై వేయడంతో ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఈ క్రమంలో ఇక్కడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ఉన్నట్టుండి రెండు జిల్లాలు దాటి పాడేరుకు డిప్యుటేషన్ వేయడంతో వారంతా ఖంగుతిన్నారు. తెలియకుండానే ఉత్తర్వులు రావడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలంటూ 27 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు, శాంతియుత ర్యాలీలు చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించాల్సిన సర్కారు వారిని పట్టించుకోకుండా సీతంపేట ఐటీడీఏ పరిధిలో వివిధ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయులు 32 మందిని పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకులాలకు డిప్యుటేషన్‌పై వేశారు. మరికొంతమందిని స్థానికంగా ఐటీడీఏ పరిధిలో సర్దుబాటు చేశారు. కనీసం ఉపాధ్యాయుల అభిప్రాయం కూడా తెలుసుకోకుండా వెంటనే వారి విధుల నుంచి రిలీవ్ చేయాలని సంబంధిత హెచ్ఎంలకు ఆర్డర్లను సైతం పంపించేశారు. గిరిజన గురుకులాల్లో ఎస్‌జీటీ క్యాడర్ ఉండదు. కేవలం టీజీటీ, పీజీటీ, జేఎల్ వంటి పోస్టులు మాత్రమే బీఈడీ అర్హతతో ఉంటాయి. వీరి స్థానంలో డిప్యుటేషన్‌పై ఎస్‌జీటీ అర్హత గల ఉపాధ్యాయులను పంపించడం గమనార్హం.

డీడీ ఏమన్నారంటే...

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొత్తం 32 మందిని తాత్కాలికంగా పాడేరుకు డిప్యుటేషన్‌పై పంపించడం జరిగిందని గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర తెలిపారు. ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని ఆయా పాఠశాలల హెచ్ఎంలకు ఆదేశాలు కూడా జారీ చేశామన్నారు.



పాడేరుకు డిప్యుటేషన్ వేస్తున్నట్లు వెలువడిన ఉత్తర్వులు

డిప్యుటేషన్లు వద్దు..



ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను పాడేరులో గురుకులాలకు డిప్యుటేషన్‌పై పంపడం సరికాదు. గురుకులాల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ పోస్టులను డీఎస్సీలో చూపించడం వల్ల వారి ఉపాధి పోతుందనే భయంతో రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. వారి సమస్య పరిష్కరించకుండా వారి స్థానంలో ఆశ్రమ పాఠశాలల సిబ్బందిని డిప్యుటేషన్‌పై వేయడం ఎంతవరకు సమంజసం. ప్రభుత్వం వింత పోకడలు మానుకుని, అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు న్యాయం చేయాలి.

– కోత ధర్మారావు, డీటీఎఫ్ గౌరవాధ్యక్షుడు

మీడియాపై దాడి సరికాదు..



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

పాలకొండ రూరల్: ప్రజా సమస్యలపై నిష్పక్షపాతంగా పోరాటం చేసే మీడియా ప్రతినిధులపై దాడులు చేయడం సరికాదని పాలకొండ ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడు జొన్నలగడ్డ కామేశ్వరారావు అన్నారు. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన సాక్షి విలేకరులపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండించారు. ఈమేరకు దాడులను నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలతో ప్రెస్‌క్లబ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో పేరుకుపోయిన రుగ్మతలను రూపుమాపే క్రమంలో మీడియా పాత్రను అన్నివర్గాల వారు గుర్తించాలన్నారు. ప్రజల పక్షాన పోరాడే క్రమంలో గిట్టనివారు దాడులు చేసినా వెనకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ సన్యాసిరావుకు అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కార్యదర్శి మండపాక శ్రీధర్‌బాబు, కోశాధికారి మండల గణేష్‌బాబు, ఎగ్జికూటివ్ సభ్యులు బి.సుబ్రహ్మణ్యం, యామల ఈశ్వరరావు, బి.వెంకటరమణతోపాటు వివిధ మీడియా సంస్థలకు చెందిన ప్రతినిధులు కె.అన్నాజీరావు, ఎస్.గాంధీ, ఎం.కల్యాణ్‌కుమార్, ఎ.మేఘశ్యామ్, సబ్బా నానాజీ, ఆర్.కోటేశ్వరరావు, వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

పసుకుడిలో ఏనుగుల సంచారం



పసుకుడి దగ్గరలో సంచరిస్తున్న ఏనుగు

భామిని: మండలంలోని పసుకుడిలో ఏనుగుల గుంపు శుక్రవారం సంచరించి భయాందోళనకు గురిచేసింది. గడిచిన నాలుగు రోజులుగా ఏనుగుల సంచారంతో నానా అవస్థలు పడుతున్న గ్రామస్తులు వాటికి దూరంగా అప్రమత్తంగా ఉంటున్నారు.పట్టపగలు ఏనుగుల గుంపు యథేచ్ఛగా తిరగాడుతూ మట్టిని పైన పోసుకుని ఉల్లాసంగా ప్రవర్తిస్తునాయి.అందుబాటులో ఉన్న మొక్కజొన్న, కూరగాయల పంటలు ధ్వంసం చేసి తినివేస్తున్నాయి. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఏనుగుల గుంపును చూడడానికి తరలి వస్తున్నారు.

వరి చేనుకుప్పలు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అధికారులు, గ్రామస్తులు

పాలకొండ రూరల్: రైతుల కష్టం అగ్నిపాలైంది. పాలకొండ మండలం యరకారాపురం గ్రామ రెవెన్యూ సరిహద్దు పరిధిలో బుక్కూరు ప్రాంతానికి చెందిన రైతులు చింతగుంటి అప్పలనాయుడు, కొరికేన బావాజీనాయుడులకు చెందిన దాదాపు ఐదు ఎకరాల వరిచేను కుప్పలు శుక్రవారం వేకువజాము 3 గంటల సమయంలో అగ్నికి ఆహుతయ్యాయి. విషయం గమనించిన గ్రామస్తులు పాలకొండ అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. ఫైర్ ఎస్సై జామి సర్వేశ్వరరావు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. గిట్టనివారు ఎవరో కావాలనే అగ్గిపెట్టారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు



గుమ్మలక్ష్మీపురం డీఆర్ఎస్ గొదాంలో సరుకులు పరిశీలిస్తున్న డీఎం

గుమ్మలక్ష్మీపురం: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జీసీసీ పార్వతీపురం డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం ఆయన గుమ్మలక్ష్మీపురం జీసీఎంఎస్ బ్రాంచ్ కార్యాలయాన్ని, డీఆర్ఎస్ గొదాం, ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్‌ను, పెట్రోల్ బంకును పరిశీలించారు. ముందుగా పెట్రోల్ బంకును సందర్శించిన ఆయన నవంబర్ నెలలో పెట్రోల్ సేల్స్ తగ్గటంపై ప్రశ్నించారు. పూర్తి స్థాయి అమ్మకాలు చేపట్టాలని సూచించారు. సేల్స్‌మేన్లతో మాట్లాడుతూ డీఆర్ డిపోల వద్ద సేల్స్‌మేన్లు, డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించాలని సూచించారు. అలాగే పీపీసీ కేంద్రాల వద్ద అటవీ ఫలసాయాల కొనుగోళ్లను ముమ్మరంగా చేపట్టి లక్ష్యాల్ని చేరుకోవాలని సూచించారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

గరుగుబిల్లి: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు ఉప తహసీల్దార్ బి.సుందరరావు పేర్కొన్నారు. మండలంలోని నాగూరులో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో సేవలను అందించేందుకు గ్రామ సభను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సుల్లో 49 రకాల సేవలను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. గతంలో పరిష్కారం కాని సమస్యలు ఈ సదస్సుల్లో పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ద్వారపురెడ్డి సత్యనారాయణ, సర్పంచ్ కేతిరెడ్డి శిరీష, నాయకులు అచ్యుతరావు, మండల సర్వేయర్ ఎస్.గాంధీ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 15 మంది ఎంపిక



జాబ్ మేళాలో పాల్గొన్న అభ్యర్థులకు సూచనలిస్తున్న ప్రతినిధులు

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 15 మంది యువతీ యువకులు వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా కురుపాం నియోజకవర్గానికి సంబంధించి కురుపాంలో జాబ్ మేళాను నిర్వహించినట్లు చెప్పారు. ఈ మినీ జాబ్ మేళాలో పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నట్టు పేర్కొన్నారు. ఇందులో 33 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి ఎస్.మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

గరుగుబిల్లి: విద్యుత్ పొదుపు వారోత్సవాలను శనివారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆ శాఖ ఏఈ బడే శ్రీనివాసనాయుడు శుక్రవారం తెలిపారు. విద్యుత్ పొదుపు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను అధికంగా విద్యుత్‌ను వినియోగించడం వల్ల కలిగే అనర్థాలను వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యుత్ పొదుపునకు ఎల్ఈడీ బల్బులను వినియోగించాలన్నారు. జేఈ బి.శంకరరావు ఉన్నారు.

నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు



వీరఘట్టం:ఎన్నికల నిర్వహణపై విధివిధానాలను వివరిస్తున్న జలవనరులశాఖ ఏఈ డీవీ రమణ

గరుగుబిల్లి: సాగునీటి సంఘాల ఎన్నికలు నిబంధనలకు లోబడి శనివారం నిర్వహించాలని ఇంజినీరింగ్ అధికారి ఎ.ప్రవీణ్ సాగర్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల సిబ్బందికి నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 13 మైనర్, మూడు మేజర్, ఒక మీడియం సంఘాలకు సంబంధించి ఎన్నిక నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల సిబ్బంది 8గంటలలోగా ఆయా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. 9 గంటల నుంచొ సాయంత్రం 5 గంటల వరకు ఎన్నిక నిర్వహించాలని సూచించారు. ఉదయం టీసీలను ఎంపిక చేసుకోవడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం చైర్మన్, వైస్‌చైర్మన్లను ఎంపిక చేసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అవసరమైన పోలీసు సిబ్బంది నియమించడం జరిగిందన్నారు. ఓటింగ్‌కు హాజరైన వారు ఏదో ఒక గుర్తింపు కార్డుతో హాజరు కావాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారులకు సామగ్రి పంపిణీ

వీరఘట్టం: ఈనెల 14న జరగనున్న నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను పక్కాగా నిర్వహించాలని జల వనరులశాఖ ఏఈ డీవీ రమణ సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు ఎన్నికల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. మండలంలో మొత్తం 13 నీటి సంఘాలున్నాయని.. ఎన్నికల పక్కాగా నిర్వహించాలని సూచించారు. అనంతరం సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ చేశారు.

విద్యుత్ పొదుపుతో ఆదా!

- నేటి నుంచి 20వ తేదీ వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు
- సూచనలు పాటించాలంటున్న విద్యుత్ శాఖ అధికారులు



గుమ్మలక్ష్మీపురంలో విద్యుత్ సబ్‌స్టేషన్

గుమ్మలక్ష్మీపురం:

'సహజ వనరులను కాపాడుకుందాం – భావి తరాలకు భరోసా కల్పిద్దాం, విద్యుత్ పొదుపు – భవితకు మలుపు, ఇంటా బయట ఎల్ఈడీ బల్బులనే వినియోగిద్దాం – ఆర్థిక లబ్ధి పొందుదాం..' వంటి నినాదాలతో వినియోగదారులను విద్యుత్ పొదుపు దిశగా మళ్లించేందుకు ఆ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. యూనిట్ విద్యుత్ పొదుపు చేస్తే రెండు యూనిట్లు విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లేనని వినియోగదారులు భావించాలని ఈ సందర్భంగా సూచిస్తున్నారు. ఈ మేరకు నేటి నుంచి ఈ నెల 20వ తేదీ వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు విద్యుత్ శాఖ అధికారులు నిర్వహించనున్నారు. సాధారణ బల్బులను ఎల్ఈడీ దీపాలుగా మార్పు చేస్తూ విద్యుత్‌ను పొదుపు చేయాలని గృహ వినియోగదారులతో పాటు దుకాణాలు, హోటళ్ల నిర్వాహకులకు, పంచాయతీ అధికారులకు ఈ వారోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పించనున్నారు.

వారోత్సవాల్లో చైతన్యం ఇలా..



- అవసరం మేరకే విద్యుత్ పరికరాలను ఉపయోగించాలి.
- తగిన సామర్థ్యం కలిగిన నాణ్యమైన కెపాసిటర్లను వాడాలి.
- ఫిలమెంట్ బల్బులకు బదులు కాంపాక్ట్ ఫ్లోరోసెంట్ ల్యాంపులను వాడాలి.
- పగటి పూట విద్యుత్ దీపాలను వాడకూడదు.
- వేడి పదార్థాలను ఫ్రిజ్ లో పెట్టకూడదు.
- ఎక్కువ రోజులు బయటకు వెళ్తే ఫ్రిజ్‌ను ఆఫ్ చేయాలి.
- గృహాలు, హోటళ్లు, వాణిజ్య సముదాయాలు, అపార్టుమెంట్లలో సోలార్ వాటర్, హీటర్లు వాడాలి.
- పాత బల్బుల స్థానంలో ఎల్ఈడీలను ఉపయోగించాలి.
- సెల్‌ఫోన్ ఛార్జింగ్ పూర్తయిన వెంటనే ఆ ప్లగ్ స్విచ్ కూడా ఆపాలి.
- ఏసీ, టీవీ వినియోగించిన తరువాత వాటి స్విచ్‌లు ఆపేయాలి.
- ఆటోమేటిక్ ఇస్త్రీ పెట్టె, మిక్సీ, వాషింగ్ మెషిన్ వినియోగాల్లో తగిన జాగ్రత్తలు పాటించాలి.
- విద్యుత్ వాటర్ హీటర్లు, గీజర్లు బదులు సూర్య కాంతితో పనిచేసే పరికరాలు వినియోగించాలి.

నియోజకవర్గంలో 76,079 సర్వీసులు

కురుపాం నియోజకవర్గంలోని గుమ్మలక్ష్మీపురం మండలంలో 12,840, జియ్యమ్మవలస మండలంలో 17,080, కురుపాం మండలంలో 14,812, గరుగుబిల్లి మండలంలో 14,882, కొమరాడ మండలంలో 16,435 చొప్పున్న విద్యుత్ సర్వీసులున్నాయి. వీటిలో గృహ వినియోగదారులతో పాటు వ్యాపార, వాణిజ్య దుకాణాలు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఉన్నాయి.

విద్యుత్ పొదుపు అందరి బాధ్యత

విద్యుత్ పొదుపు అందరి బాధ్యత. విద్యుత్ వినియోగంలో ఆదాను ప్రతీ ఒక్కరు పాటించాలి. అలా చేస్తే విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లే భావించాలి. విద్యుత్ పొదుపు పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలి.

– ఎస్.రవికుమార్, ట్రాన్స్‌కో ఏఈ, గుమ్మలక్ష్మీపురం

రిలే నిరాహార దీక్షలు..



గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఐటీడీఏ ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 24వ రోజుకు చేరుకున్నాయి. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని.. 2022 పీఆర్‌సీ ప్రకారం జీతాలు చెల్లించాలని.. డీఎస్సీ నుంచి తమ పోస్టులు మినహాయించాలని కోరుతూ శాంతియుత నిరసన చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బిడ్డిక గణేష్, భవానీ, తదితరులు పాల్గొన్నారు. –సీతంపేట

పాడైన రహదారి..



పాలకొండ మండలంలోని రాజుపేట – ఎం.సింగుపురం రహదారి అధ్వానంగా మారింది. రహదారి మొత్తం గుంతలమయం కావడంతో సుమారు ఐదు కిలోమీటర్లు రాకపోకలకు ఇబ్బంది తప్పడం లేదు. ఈ రహదారి మీదుగా సుమారు 11 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – పాలకొండ

పారిశుధ్యం అధ్వానం..



పాలకొండ పట్టణంలోని 20 వార్డుల్లో పారిశుధ్య నిర్వహణతో పాటు కుక్కలను నియంత్రించడంలో నగర పంచాయతీ యంత్రాంగం చొరవ కొరవడింది. ఏ వీధి కూడలి వద్ద చూసినా వ్యర్థాల కుప్పలు దర్శమిస్తున్నాయి. దీంతో దుర్గంధంతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి. ఈ చెత్త కుప్పల వద్ద ఆహారం సేకరించుకునే క్రమంలో కుక్కల గుంపులు పెద్ద ఎత్తున అక్కడకు చేరి వ్యర్థాలను చిందరవందర చేస్తున్నాయి. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – పాలకొండ రూరల్

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాలకొండ / కురుపాం
9951602844, 9010204441
Office mail : vzmadvt@gmail.com